మైదానంలో వలయం

అనేక జంతువులు, పక్షులు ఉండే అడవి మారుమూల ప్రాంతంలో ఒక వేటగాడు ఉండేవాడు. అతని పేరు వావుపీ – దాని అర్థం తెల్ల డేగ. పొడవుగా, బలిష్టంగా ఉండే అతని కళ్లల్లో యవ్వనం మెరుస్తుంటుంది. అడవిలో ఎటువంటి ప్రాంతంలోనైనా అతను భయం లేకుండా తిరిగేవాడు. అన్ని జంతువులు, పక్షుల జాడలను పసిగట్ట గలిగేవాడు. అందరూ మెచ్చుకునే, నైపుణ్యమున్న వేటగాళ్లల్లో అతను ఒకడు. ప్రతిరోజూ అతను తప్పనిసరిగా ఏదో ఒక దానిని వేటాడి, ఇంటికి తెచ్చేవాడు.

ఒకసారి అతను ఇంటి నుంచి ఎప్పుడూ వెళ్లనంత దూరం వెళ్లాడు. అక్కడ అడవి పలచగా ఉంది. చెట్ల మధ్య మెరుపులు కనిపించటంతో అతను అక్కడికి వెళ్లాడు. అతను అడవి అంచును చేరుకున్నాడు. గడ్డి, పూల మొక్కలు ఉన్న మైదానానికి అతను వచ్చాడు.



దారులు ఏమీ లేని ఆ మైదానంలో అతడు ముందుకు వెళుతున్నాడు. ఉన్నట్టుండి అతనికి ఎవరో గుండ్రంగా తిరగటం వల్ల ఏర్పడినట్టు ఉన్న ఒక వలయం కనిపించింది.

అయితే ఆ వలయానికి చేరుకునే దారి కానీ, కాళ్ల గుర్తులు కానీ అతనికి కనిపించలేదు. ఒక విరిగిన కొమ్మ గానీ, తొక్కిన ఆకు గానీ కనపడలేదు.



ఆ వింత వలయ రహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో దగ్గరలోని పొడవాటి గడ్డిలో దాక్కుని, అతను వేచి ఉన్నాడు. అంతలో అతనికి గాలిలో లీలగా సంగీతం వినిపించసాగింది. తల పైకెత్తి చూడగా కిందికి దిగుతున్న ఒక వస్తువు కనిపించింది. మొదట్లో నలుసు లాగా కనిపించిన అది చూస్తుండగానే పెద్దదవుతూ ఎంతో అందమైన పన్నెండు అమ్మాయిలు ఉన్న పెద్ద బుట్టగా మారింది.

అది కిందకి వస్తుండగా సంగీతం స్పష్టంగా, మధురంగా వినిపించసాగింది. బుట్ట నేలని తాకగానే ఆ అమ్మాయిలు బయటకు గెంతి వలయంలో నాట్యం చెయ్యసాగారు. అలా నాట్యం చేస్తూ మధ్యలో మెరుస్తున్న బంతి లాగా ఉన్నదానిని డప్పుని కొట్టినట్టు కర్ర పుల్లలతో కొడుతున్నారు.

దాగి ఉన్న చోటునుంచి వావుపీ మనోహరంగా ఉన్న ఆ నాట్యాన్ని చూస్తూ ఉన్నాడు.
ఆ అమ్మాయిలందరూ అందంగా ఉన్నారు. అయితే, అందరిలోకి చిన్నదయిన అమ్మాయి అతనికి ఎంతో నచ్చింది.

చివరికి, తనని తాను నిగ్రహించుకోలేక ఆ అమ్మాయిల వైపు పరుగుతీసి అందరిలోకి చిన్న ఆమెను పట్టుకోబోయాడు. అయితే ఆ అమ్మాయిలు పక్షుల లాగా వేగంగా బుట్టలోకి చేరుకోగానే అది ఆకాశంలోకి ఎగిరిపోయింది.

“ఆమె వెళ్లిపోయింది. ఆమె మళ్లీ కనిపించదు,” అనుకుంటూ అతను ఇంటికి చేరుకున్నాడు. అయితే ఆ రాత్రంతా అతనికి నిద్ర పట్టలేదు.

మరునాడు ఉదయమే అతను ఆ వలయం దగ్గరకు చేరుకున్నాడు. దానికి దగ్గరలో అతనికి ఎలుకలు ఉన్న ఒక చెట్టు మొదలు కనిపించింది. ఈ ఎలుకలంటే ఆ అమ్మాయిలు భయపడరు అనుకుని ఆ మొదలుని వలయం దగ్గరకి చేర్చి, తాను కూడా ఒక ఎలుకగా మారిపోయాడు.

కొంత సేపటికి ఆ అక్కచెల్లెళ్లు ఆకాశం నుంచి కిందకి దిగి నాట్యం చెయ్యసాగారు.

"అటు చూడండి!" అందరిలోకి చిన్న అమ్మాయి అంది,

“ఈ చెట్టు మొదలు అంతకు ముందు ఇక్కడ లేదు.” ఆమె భయపడిపోయి బుట్ట దగ్గరకు పరుగుతీసింది. అయితే మిగిలిన అమ్మాయిలు తమ చేతిలోని పుల్లలతో చెట్టు మొదలును ఆటమాదిరి కొట్టసాగారు. దాంతో వావుపీ తోసహా అందులో ఉన్న ఎలుకలన్నీ బయటకు వచ్చాయి. చూస్తుండగానే ఒక్క ఎలుకను తప్పించి మిగిలిన వాటిని ఆ అమ్మాయిలు చంపేశారు. ఆ ఒక్కదానిని కొట్టటానికి అందరికంటే చిన్న అమ్మాయి కర్ర పుల్ల ఎత్తేసరికి వావుపీ తిరిగి తన రూపం లోకి వచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. మిగిలిన అమ్మాయిలందరూ బుట్టలోకి దూకటమూ, అది ఆకాశంలోకి ఎగరటమూ చూస్తుండగానే జరిగిపోయాయి.

ఆమెను సంతోష పరచటానికి, ఆమె ప్రేమను పొందటానికి వావుపీ అన్ని రకాలుగా ప్రయత్నించాడు. ఆమె కన్నీళ్లు తుడిచాడు. వేటగాడిగా తన అనుభవాలను ఆమెతో పంచుకున్నాడు. భూమి మీద జీవితం ఎంత అందంగా ఉంటుందో చెప్పాడు.

అలసట అనేది లేకుండా ఆమె పైనే తన దృష్టినంతా నిలిపాడు. ఎంతో ప్రేమతో తన ఇంటివైపుకి నడిపించాడు. ఆమె ఇంటిలోకి అడుగు పెట్టగానే అతని గుండె సంతోషంతో ఉప్పొంగిపోయింది. తనకి మించిన అదృష్టవంతుడు లేడని అతను అనుకున్నాడు.

చలి కాలం, వేసవి కాలాలు త్వరలోనే గడిచిపోయాయి. అందమైన అబ్బాయి పుట్టటంతో వాళ్ల ఆనందం మరింత పెరిగింది. అయితే, వావుపీ భార్య ఒక నక్షత్ర రాజు కూతురు. భూమి మీద జీవితం తన అందాన్ని కోల్పోతుండటంతో ఆమెకు తన తండ్రి దగ్గరకు తిరిగి వెళ్లాలని అనిపించసాగింది. దాంతో, ఆమె భర్త వేటకి వెళ్లినప్పుడు ఒక బుట్ట తయారు చేస్తూ అతను ఇంట్లో ఉన్నప్పుడు అతనికి కనపడకుండా దానిని దాచిపెట్టి ఉంచేది. ఈలోగా తన తండ్రి ఇష్టపడతాడనుకున్న అపురూపమైన వస్తువులు, ఆహార పదార్థాలు సేకరించసాగింది.



అన్నీ ఏర్పాట్లు పూర్తయిన తరవాత ఒక రోజు ఆమె తన కొడుకుని తీసుకుని మైదానంలోని వలయం దగ్గరకు వెళ్లింది. వాళ్లిద్దరూ బుట్టలో కూర్చున్న తరవాత ఆమె పాట పాడసాగింది. ఆ పాటను గాలి ఆమె భర్త దగ్గరకు తీసుకుని వెళ్లింది. ఆ గొంతు అతనికి బాగా తెలుసు. వెంటనే అతను మైదానం వైపు పరుగుతీశాడు. కానీ, అతను అక్కడికి చేరుకునే సరికి వాళ్లిద్దరూ బుట్టలో ఆకాశంలోకి ఎగిరిపోతున్నారు. అతను ఎంత పిలిచినా లాభం లేకపోయింది. బుట్ట ఇంకా, ఇంకా పైకి వెళుతూ నలుసుగా మారి చివరికి కనుమరుగై పోయింది. అతను నేలకి ఒరిగిపోయి ఏడవసాగాడు.

భార్యనీ, కొడుకునీ తలుచుకుని బాధపడుతూ సుదీర్ఘమైన చలి కాలం, వేసవి కాలం గడిపాడు. భార్యను తలుచుకుని అతను ఏడుస్తుండేవాడు, అయితే కొడుకు జ్ఞాపకాలు అంతకంటే ఎక్కువగా అతనిని భాదించేవి. నక్షత్ర లోకం చేరుకున్న అతని భార్య తన సంతోషాలలో మునిగి తేలుతూ భూమి మీద భర్తని వదిలిపెట్టి వచ్చానన్న సంగతే మరిచిపోయింది. పెద్ద అవుతున్న కొడుకు తాను పుట్టిన ప్రదేశాన్ని చూడాలన్న ఉత్సుకత చూపించటం వల్ల అప్పుడప్పుడు ఆమెకు భర్త గుర్తుకు వచ్చేవాడు.

ఒకసారి నక్షత్ర రాజు తన కూతురితో ఇలా అన్నాడు, "అమ్మాయీ, నీ కొడుకుని నీ భర్త దగ్గరకు తీసుకుని వెళ్లు. అతనిని కూడా మనతో ఉండటానికి తీసుకుని రా. అయితే వచ్చేటప్పుడు అతను వేటాడిన పక్షులు, జంతువులలో నుంచి ఒక భాగం తీసుకుని రమ్మను."

కొడుకుని తీసుకుని నక్షత్ర రాజు కూతురు మళ్లీ భూమి మీదకు వచ్చింది. ఆ వలయాన్ని వదిలి ఎంతో దూరం వెళ్లని వావుపీ నేల మీదకి దిగివస్తూ ఆమె పాడుతున్న పాటను విన్నాడు. భార్యా, కొడుకుల కోసం ఎగిసిపడే గుండెలతో అతను చూస్తున్నాడు. కిందకి దిగగానే వాళ్లని గాఢంగా హత్తుకున్నాడు.

అతని భార్య తన తండ్రి కోరిక గురించి చెప్పింది. దాంతో మామగారికి బహుమతిగా ఇవ్వటానికి వావుపీ ఎంతో ఉత్సాహంగా వేటకి బయలు దేరాడు. ఎన్నో పగళ్లు, రాత్రులు వేటలో గడిపాడు. ఎంతో అరుదైన, ఎంతో అందమైన పక్షులను, జంతువులను వేటాడి వాటి నుంచి తోక, కాలు, ఈక వంటివి సేకరించాడు. ఆ విధంగా కావలసినవన్నీ తీసుకున్న తరవాత ఆ ముగ్గురూ వలయం దగ్గరకు వచ్చి, బుట్టలో కూర్చుని ఆకాశంలోకి ఎగిరారు.

వాళ్లు తిరిగి వచ్చిన తరవాత అందరూ ఎంతో సంతోషించారు. నక్షత్ర రాజు ఇతర నక్షత్రాలను కూడా పిలిచి పెద్ద విందు ఇచ్చాడు. అందరూ వచ్చిన తరవాత భూమి నుంచి తెచ్చిన బహుమతుల లోనుంచి ఎవరికి నచ్చింది వాళ్లని తీసుకోమని చెప్పాడు.

దాంతో పెద్ద కోలాహలం చెలరేగింది. ఒకరు కాలు తీసుకుంటే, ఒకరు తోక తీసుకున్నారు, ఒకరు రెక్క, ఒకరు గోరు తీసుకున్నారు. తోక, కాలు వంటివి తీసుకున్న వాళ్లు జంతువులుగా మారి పరుగులు తీశారు. రెక్క, గోరు వంటివి తీసుకున్న వాళ్లు పక్షులుగా మారి ఎగిరిపోయారు. వావుపీ తెల్ల డేగ రెక్క తీసుకున్నాడు. అతని భార్యా, కొడుకు కూడా అదే తీసుకున్నారు.

భార్యా, కొడుకు వెంట రాగా ఇతర పక్షులతో కలిసి వావుపీ రెక్కలు చాపి నేల మీదకి వచ్చాడు. ఇప్పటికీ ఆ ముగ్గురునీ భూమి మీద చూడవచ్చు.

అయిపోయింది